## ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల రద్దీ



బస్సు ఎక్కేందుకు వచ్చిన మహిళలు

తెలంగాణచౌక్, డిసెంబర్ 23 : ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ప్రారంభించినప్పటి నుంచి నిత్యం బస్సుల్లో రద్దీ కనబడుతోంది. కరీంనగర్ రీజియన్ పరిధిలో 459 పల్లెవెలుగు, 207 ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో గతంలో ప్రతి రోజూ 2.50 లక్షల మంది ప్రయాణించే వారు. కానీ, ఈ పథకం ప్రారంభమైన ఈ నెల 9 నుంచి ప్రతి రోజూ 4 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. ఉచిత ప్రయాణంతో ప్రయాణికుల సంఖ్య 50 శాతం పెరిగింది. ఇందులో మహిళలే అధికంగా ఉంటున్నారు. అయితే, సరిపడా బస్సులు లేక పోవడంతో అదనంగా ట్రిప్పులు నడిస్తున్నారు. రీజియన్ పరిధిలో 1198 మంది డ్రైవర్లు, 1447 కండక్టర్ల ఉండగా, వీరికే అదనంగా విధులను కేటాయిస్తున్నారు.

## నీటిని పొదుపుగా వాడుకోవాలి

ఎస్సారెస్పీ ఈఎన్సీ శంకర్



తిమ్మాపూర్, డిసెంబర్ 23 : రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలని ఎస్సారెస్పీ ఇంజినీర్ ఇన్ చీఫ్ శంకర్ కోరారు. కాకతీయ ఆయకట్టు రైతులు యాసంగిలో ఆరుతడి పంటలను వేసుకోవాలని సూచించారు. తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీ కాలనీలోని నీటిపారుదల శాఖ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రస్తుతం యాసంగి సాగుకు 27.541 టీఎంసీలు ఎల్ఎండీతో పాటు శ్రీరాజరాజేశ్వర జలాశయంలో అందుబాటులో ఉందని, జనవరి 1 నుంచి మార్చి 31 వరకు పంటలకు కాకతీయ కాలువ ద్వారా 9 రోజులు ఆన్, 6 రోజులు ఆఫ్ పద్ధతిలో నీటిని విడుదల చేయనున్నట్లు తెలిపారు. చివరి ఆయకట్టు రైతులు ఆరుతడి పంటలు వేస్తే బాగుంటుందని, ఆ దిశగా రైతులు ఆలోచన చేయాలని సూచించారు. ఎల్ఎండీ నుంచి సూర్యాపేట వరకు నీరు ఇవ్వాలని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆదేశించారని తెలిపారు. 24 టీఎంసీల సామర్థ్యం గల ఎల్ఎండీ రిజర్వాయర్లలో ప్రస్తుతం 19.531 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఈ శివకుమార్, అధికారులు ఉన్నారు.



# కరోనా తెచ్చిన కొత్త తంటా

- నాడు చదువు కోసం సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ఇంటర్నెట్ వాడకం
- నేడు అవసరం లేకున్నా అతుక్కుపోతున్న విద్యార్థులు
- స్క్రీన్ ఎక్కువ చూడడం వల్ల దృష్టిలోపాలు.. మానసిక సమస్యలు
- కౌన్సెలింగ్, సైకాలజిస్టుల వద్దకు పిల్లలు • ఆందోళనలో తల్లిదండ్రులు
- ప్రమాదం ముంచుకొస్తుందంటున్న సైకియాట్రిస్టులు
- పేరెంట్స్ నుంచే మార్పు మొదలు కావాలంటున్న నిపుణులు
- అప్రమత్తంగా వ్యవహరిస్తే బయట పడొచ్చంటున్న వైద్యులు

*మూడేళ్ల క్రితం అల్లకల్లోలం సృష్టించిన కొవిడ్-19, ఇప్పుడు కొత్త తంటాలను తెచ్చిపెడుతున్నది. నాడు తప్పని పరిస్థితుల్లో చదువు కోసం సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లు వంటివి వాడినా.. నేడు చాలా మంది విద్యార్థులు అందులోంచి బయటికి రాలేకపోవడం ఆందోళన కలిగిస్తున్నది. పిల్లలు ఇంటర్నెట్ మాయాజాలంలో చిక్కుకుపోవడం భయపెడుతున్నది. స్క్రీన్ ఎక్కువ సమయం చూడడం వల్ల పిల్లల్లో దృష్టిలోపాలతోపాటు మెమొరీ లాస్, మెడనొప్పులు, మానసికంగా కుంగుబాటు, ఆత్మనూన్యతాభావం.. ఇలా అనేక రుగ్మతల బారిన పడుతున్నట్లు ఇటీవలి అనేక అధ్యయనాల్లో వెల్లడైంది. తల్లిదండ్రులు మందలిస్తే తిండిమానేయడం, మొండిగా ప్రవర్తించడం, చిరాకు పడడం ఉంటాయని సైకియాట్రిస్టులు చెబుతుండగా, ఈ వ్యసనం నుంచి బయట పడేయకపోతే విద్యార్థుల భవిష్యత్తే అంధకారంగా మారే ప్రమాదమున్నది. అయితే, వందకు 80 శాతం ఇండ్లలో ఎదురవుతున్న ఈ సమస్య నుంచి పిల్లలను బయట పడేయాలంటే ఏం చేయాలి? తల్లిదండ్రులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? ఈ ముప్పు నుంచి విద్యార్థులను ఎలా కాపాడుకోవాలి? చదువుపైకి పిల్లల దృష్టిని ఎలా మరల్చాలి? ఇలాంటి అనేక అంశాలపై నేటి సండే స్పెషల్..*

సండే స్టోరీ

కరీంనగర్, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : 2020 జనవరి 30న వుహాన్ నుంచి కేరళ రాష్ట్రానికి వచ్చిన విద్యార్థికి కరోనా వైరస్ సోకినట్లుగా గుర్తించిన కేంద్ర ప్రభుత్వం, ఆ వెంటే నివారణకు చర్యలు తీసుకున్న విషయం తెలిసిందే. అప్పుడు ఐదు దశల్లో లాక్‌డౌన్ విధించింది. 2020 మార్చి 25న మొదటిదఫా లాక్‌డౌన్ మొదలు కాగా, ఆ తర్వాత దఫదఫాలుగా సాగింది. 2020 జూన్ 1 నుంచి 20 జూన్ వరకు ఐదో లాక్‌డౌన్ కొనసాగింది. అనంతరం లాక్‌డౌన్ ఎత్తివేసినా.. పాఠశాలలు ప్రారంభం కాలేదు. దీంతో విద్యార్థులకు విద్యను అందించేందుకు ఆ సమయంలో మొబైల్‌ఫోన్, కంప్యూటర్, ల్యాప్‌టాప్ వంటి పరికరాల ఉపయోగంతోపాటు ఇంటర్నెట్ యుసేజ్ బాగా పెరిగింది. కరోనాకు ముందు, తర్వాత చూస్తే ఈ యుసేజ్ విద్యార్థుల్లో చాలా ఎక్కువగా ఉన్నది. కరోనా సమయంలో పిల్లలకు చదువు ఎలా చెప్పాలో అర్థం కాక విద్యాసంస్థల యాజమాన్యాలు, తల్లిదండ్రులు కూడా కంప్యూటర్స్, ల్యాప్‌టాప్స్, ఐపాడ్, ట్యాబ్ వంటి వాటిని సమకూర్చి నేర్పించారు. రానున్న రోజుల్లో ఇక విద్య ఇలానే చదువుకోవాల్సి వస్తుందన్న విధానాన్ని క్రియేట్ చేశారు. అప్పుడు పిల్లలు ఆ పరికరాలకు అలవాటు కావడం మొదలైంది. ఆ తర్వాత నార్మల్ పరిస్థితులు వచ్చినా వాటి నుంచి బయటకు రాలేని పరిస్థితి ఎదురైంది.

### తరచూ చూస్తే ప్రమాదకరమే..

ఇంటర్నెట్‌లో మనం దేనిని ఎక్కువగా వీక్షిస్తామో.. అందుకు సంబంధించిన కంటెంట్ ఎక్కువగా వస్తుంది. అంటే ఏదైనా మనం చూసే దానిపై ఆధారపడి ఉంటుంది. పిల్లలు, పెద్దలు, వృద్ధులకు ఒక సైకలాజిలాజికల్ అటాచ్‌మెంట్ ఉంటుంది. ఆ అటాచ్‌మెంట్‌తో తరచూ చూడడం వల్ల మెదడులో కొన్ని పాజిటివ్ ఉత్ప్రేరకరమైన రసాయనాలు విడుదల అవుతాయి. దాని వల్ల మెదడు.. మళ్లీ మళ్లీ అదే కంటెంట్ కోసం కోరుకుంటుంది. ఉదాహరణకు పిల్లలకు సంబంధించినవి చూస్తే.. కార్టూన్స్, సినిమాలు వంటివి చూసేందుకు చూపుతున్న ఇంట్రెస్టు బుక్స్ చదివేందుకు కనిపించదు. ఎందుకంటే అందులో కంటెంట్ చూస్తేనే వారిలో ఉత్తేజం కనిపిస్తుంది. ఇది పుస్తకాల్లో ఉండదు. దీని వల్ల అన్ని వ్యసనాల మాదిరిగానే రానున్న రోజుల్లో మొబైల్, టీవీ, ఇంటర్ నెట్ అనేది ఒక అడిక్షన్ లాగా కన్వర్ట్ అవుతుంది. ఇది చాలా ప్రమాదకరమైనది.


### పేరెంట్స్ ఇలా చేయండి..

-సైకియాట్రిస్ట్ సాయికృష్ణ



కరోనా తర్వాత మొబైల్‌ఫోన్లు, కంప్యూటర్లకు అడిక్ట్ అవుతున్న విద్యార్థుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నదని కరీంనగర్‌కు చెందిన ప్రముఖ సైకియాట్రిస్ట్ సాయికృష్ణ హెచ్చరిస్తున్నారు. తద్వారా విచిత్ర ధోరణి కనిపిస్తున్నదని, ఈ పరిస్థితుల్లో చాలా మంది పేరెంట్స్ తమ పిల్లలను కౌన్సెలింగ్‌కు తీసుకొస్తున్నారని చెబుతున్నారు. ఈ రుగ్మత నుంచి బయట పడేయాలంటే ముందుగా తల్లిదండ్రుల నుంచే మార్పు మొదలుకావాలని సూచిస్తున్నారు. వారి సహకారంతోనే పిల్లలను ఆ అడిక్షన్ నుంచి బయటకు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తామని, అందుకోసం మన దినసరి చర్యల్లో కొన్ని మార్పులు చేసుకోవాల్సిన అవసరమున్నదని వివరిస్తున్నారు. అందులో కొన్ని ప్రధానంగా చూస్తే..

- వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూహెచ్‌వో) తన సర్వేల్లో పిల్లలకు ఎక్కువగా స్క్రీన్ ఇవ్వకూడదని చెబుతున్నది. స్క్రీన్ అనేది 10 నుంచి 12 సంవత్సరాలు దాటేంత వరకు.. ఎంత దూరం పెడితే అంత మంచిదని సర్వేలో స్పష్టంగా చెప్పింది.
- పిల్లలు స్క్రీన్ చూడడం తగ్గాలంటే.. అది తల్లిదండ్రుల నుంచే మొదలు కావాలి. పిల్లల ముందు ఫోన్ చూడడం, వాట్సాప్, ఫేస్‌బుక్, యూట్యూబ్, సినిమాలు చూడడం తగ్గించుకోవాలి. అంటే పేరెంట్స్‌లో సెల్ఫ్ కంట్రోల్ అనేది రావాలి. అది ఎప్పుడైతే రావడం మొదలవుతుందో.. అప్పటి నుంచే పిల్లలు తమ తల్లిదండ్రులను రోల్‌మాడల్‌గా తీసుకుంటారు. పిల్లలు కూడా అలవాటును తగ్గించుకునేందుకు ఆసక్తి చూపుతారు.
- ప్రతి ఇంట్లో నో మొబైల్ జోన్.. మొబైల్ ఫ్రీ జోన్ లేదా ఇంటర్నెట్ రిస్ట్రిక్టెడ్ టైం క్రియేట్ చేసుకోవాలి. ఉదాహరణకు రాత్రి 8 నుంచి 9.30 గంటల వరకో.. భోజనం చేసే సమయంలోనో.. ఎవరూ మొబైల్, టీవీ, ఇంటర్నెట్ వంటివి చూడకుండా ఒకరితో ఒకరు మాట్లాడుకోవడం.. ఒకరికొకరు హెల్ప్ చేసుకోవడం వంటివి చేయాలి. దీని వల్ల స్క్రీన్‌టైం తగ్గించడానికి ఒక అవకాశం ఏర్పడుతుంది.
- తల్లిదండ్రులు తమ పిల్లలను అప్పుడప్పుడు వాకింగ్‌కో లేదా పార్కులకో.. గుడికో ఇతర ప్రదేశాలకో బయటికి తీసుకెళ్లాలి. దాంతో పిల్లల దృష్టి మరలుతుంది. ఎందుకంటే.. వివిధ ప్రాంతాలకు వెళ్లినప్పుడు అక్కడి పరిస్థితులు, దృశ్యాలు వారిని ప్రభావితం చేస్తాయి. ఎన్నో విషయాలు ఆసక్తి పెంచుతాయి. కొత్త ప్రదేశాలైతే కొత్త అనుభూతినిస్తాయి. దీని వల్ల పిల్లలు ఫోన్, టీవీ వంటివి చూడడం తగ్గించి, మిగిలిన వాటిపై ఇంట్రెస్ట్ పెంచుకుంటారు.
- సెన్సిటివ్ ఉన్న పిల్లలకు మొబైల్ స్థానంలో.. కొత్త వినోదాన్ని అందివ్వాలి. అంటే ఉదాహరణకు.. క్రికెట్, షటిల్, బ్యాడ్మింటన్ ఇలా ఏదైనా ఒక కొత్తగేమ్‌లో వాళ్లను భాగస్వాములను చేయాలి. అలా చేస్తే మొబైల్ నుంచి దూరమై కొత్త విషయాలపై మక్కువ చూపుతారు.
- కుటుంబ సభ్యులందరూ కలసి భోజనాలు చేసే సమయంలో లేదా విహార యాత్రల సమయంలో స్క్రీన్‌లను ఆఫ్ చేయాలి. నిద్రవేళకు 30 నుంచి 60 నిమిషాల ముందు వాటిని ఆఫ్ చేసి, బెడ్‌రూమ్‌ల నుంచి వాటిని తీసివేసే అలవాటు పెంచుకోవాలి. పిల్లలతో ఆప్యాయంగా మాట్లాడాలి. సహకారం, స్నేహం, ఇతరులపై శ్రద్ధ వంటి మంచి ప్రవర్తనను సూచించాలి. అర్థవంతమైన లేదా ఆసక్తి ఉన్న ప్రదేశాలకు వారిని కనెక్టు చేయాలి. స్క్రీన్‌లతో సంబంధం లేని క్రీడలు, సంగీతం, కళలు ఇలా అభిరుచులకు అనుగుణంగా ప్రోత్సహించాలి. ఆన్‌లైన్ గోప్యత, భద్రత గురించి వివరించాలి. కుటుంబ సభ్యులు, స్నేహితులతో సృజనాత్మకత, కనెక్షన్‌ని పెంపొందించే మార్గాల్లో స్క్రీన్‌లను ప్రోత్సహించాలి.



### ఎన్నో సమస్యలు

పిల్లలు ఫోన్స్, కంప్యూటర్ వంటి పరికరాలకు అడిక్ట్ కావడం వల్ల పిల్లల్లో దృష్టి లోపాలు, ఏకాగ్రత దెబ్బతినడం, మెమొరీ లాస్, మెడనొప్పులు, చేతులు గుంజడం, త్వరగా అలసి పోవడం వంటివి జరుగుతున్నాయి. అంతేకాదు నిద్రలేమి, బరువు పెరగడం, తరచూ మానసికంగా డల్‌గా ఉండడం, తమని తాము చిన్నచూపు చూసుకోవడం అంటే నెగటివ్ సెల్ఫ్ ఇమేజీ రావడం.. పుస్తకాలు చదివేందుకు పెద్దగా ఆసక్తి చూపకపోవడం వంటివి కనిపిస్తాయి. కొన్నిసార్లు తల్లిదండ్రులు చూడొద్దని చెబుతున్నారో.. ఆ సమయంలో పిల్లలు తిండి మానేయడం, మొండిగా ప్రవర్తించడం, సహకరించక పోవడం, చిరాకు పడడం వంటివాటిని గమనిస్తున్నాం. నిద్ర పోకపోవడం, క్లాసులో సరిగ్గా వినకపోవడం, సరిగ్గా చదవకపోవడం, కుటుంబసభ్యులు , స్నేహితులతో తక్కువ సమయం కేటాయించడం చోటు చేసుకుంటున్నాయి. కొన్ని సమయాల్లో హింస, అసభ్య ప్రేరేపిత దృశ్యాలు, లేదా సవాళ్ల వీడియోలు, విద్యార్థులను తప్పుదారి పట్టించే విధంగా చేస్తున్నాయి. నిజానికి ఈ స్క్రీన్స్ నుంచి పిల్లలను దూరం చేయడం ప్రస్తుతం కుటుంబాలకు ఒక సవాలుగా మారింది. అలా అని వదిలేస్తే భవిష్యత్తే ప్రశ్నార్థకంగా మారే ముప్పున్నది.


నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9160900024/9640400073. NT-314383-AII

PLOT FOR SALE

★ Residential Plot 2250 Sq. yards for Sale in Prime Residential Area at Near SRR College, Jagityal Road, Karimnagar Town. Ph: 9703544199. NT-324481

CHANGE OF NAME

★ I, MADAPA ARUN KUMAR, S/o. Prabhakar Reddy, R/o. 3-14, Kuchanpally, Husnabad, Siddipet, TS. Changed My Name as MADAPA ARUN REDDY, S/o. Prabhakar Reddy. NT-324487

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 91827 77571

91827 77194


## దేశంలో తెలంగాణ అగ్రగామిగా నిలవాలి

మాజీ ఎంపీ వినోద్ కుమార్



కరీంనగర్: మార్కెట్ రోడ్డులోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మేయర్ సునీల్‌రావు

కమాన్‌చౌరస్తా, డిసెంబర్ 23 : తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలవాలని, దేవుడి దయతో వర్షాలు సమృద్ధిగా కురిసి రాష్ట్రం సభిక్షంగా ఉండాలని కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ ఆకాంక్షించారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా కరీంనగర్‌లోని మార్కెట్ ఏరియా, మంకమ్మతోట శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాలతో పాటు, మంకమ్మతోటలోని సత్యనారాయణ స్వామి ఆలయాల్లో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాలను అభివృద్ధి బాటలో తీసుకుపోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట మేయర్ సునీల్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కార్పొరేటర్లు పిట్టల శ్రీనివాస్, కిరణ్మయి, మల్లేశం, సీనియర్ నాయకులు జక్కుల నాగరాజు, సంపత్, సాయి పాల్గొన్నారు.

## జనంలోనే సంజయ్ కల్వకుంట్ల

- ‘గుడ్ మార్నింగ్ ఎమ్మెల్యే’తో చేరువ



మెట్‌పల్లిలో డ్రైనేజీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

మెట్‌పల్లి, డిసెంబర్ 23: ప్రజాసేవే లక్ష్యంగా వైద్య వృత్తి నుంచి రాజకీయాల్లోకి వచ్చిన డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల తన తొలి ప్రయత్నంలో అసెంబ్లీలో అడుగు పెట్టారు. గుడ్ మార్నింగ్ ఎమ్మెల్యే కార్యక్రమం పేరిట పట్టణాలు, పల్లెల్లో పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం మెట్‌పల్లి పట్టణంలోని 6వ వార్డును సందర్శించారు. వార్డులో పర్యటిస్తూ ప్రజలను ఆత్మీయంగా పలకరిస్తూ తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్‌కు సంబంధించిన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వార్డులో అక్కడక్కడ ప్రజలు విన్నవించిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మరికొన్ని క్షేత్రస్థాయి సమస్యలను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. వార్డుల్లో ప్రజలకు ఇబ్బంది కలుగకుండా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే వైద్యం కోసం ఆర్జించిన పలువురి రోగులకు సంబంధించి వైద్యసేవలు అందించారు. ఎమ్మెల్యే పొద్దున్నే తమ వార్డుకు వచ్చి పర్యటించడంపై స్థానికులు సంతోషం వెలిబుచ్చారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ ఉపాధ్యక్షుడు బోయినపల్లి చంద్రశేఖర్‌రావు, వార్డు కౌన్సిలర్ బంగారు కాళ్ల కిషోర్, కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.



వేములవాడ టౌన్: ఉత్సవమూర్తులతో ఆలయంలో ప్రదక్షిణ చేస్తున్న భక్తులు



ధర్మపురి: ఉత్తర ద్వారం నుంచి బయటికి వస్తున్న స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

## వైకుంఠ ద్వార దర్శనం.. భక్తజనం పునీతం

వేములవాడటౌన్/ధర్మపురి, డిసెంబర్ 23: ముక్కోటి ఏకాదశి వేడుకలు శనివారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా వైభవంగా జరిగాయి. ప్రముఖ క్షేత్రాలైన వేములవాడ రాజన్న ఆలయం, ధర్మపురి లక్ష్మీనృసింహస్వామి, ఇల్లందకుంట సీతరామచంద్రస్వామి ఆలయాలు భక్తులతో కిక్కిరిసి పోయాయి. వీటితో పాటు ఉత్తర ద్వారాలను పూలు, విద్యుత్ లైట్లతో అందంగా అలంకరించగా, వైకుంఠ ఏకాదశి శుభగడియల్లో స్వామిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఉత్తర ద్వారం నుంచి వెళ్లి స్వామిని దర్శించుకున్నారు. కాగా, చిగురుమామిడి మండలం సుందరగిరి, ముల్కనూర్ గ్రామాల్లోని వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు ఉత్తర ద్వారా దర్శనం చేసుకుని, ప్రత్యేక పూజలు చేశారు.

## ఆరు గ్యారెంటీలను అమలు చేస్తాం

మంత్రి పొన్నం ప్రభాకర్



సుందరగిరిలో పూజలు చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు

చిగురుమామిడి, డిసెంబర్ 23: రాష్ట్రంలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని రాష్ట్ర రోడ్డు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. శనివారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా చిగురుమామిడి మండలం సుందరగిరి, చిన్న ముల్కనూర్ గ్రామాల్లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ఆయన సతీసమేతంగా ఉత్తర ద్వార దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు మంత్రికి తీర్థప్రసాదాలు అందజేసి, శాలువాతో సత్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అందరికీ న్యాయం చేస్తుందని, అందుకు భగవంతుడు ఆశీస్సులు ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. మంత్రి వెంట ఆలయ చైర్మన్ గందె సంపత్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి, వివిధ పార్టీల నాయకులు ఉన్నారు. ముల్కనూర్ ఆలయంలో మంత్రి దంపతులను మాజీ ఎంపీటీసీ ముప్పిడి సంగీత దేవేందర్‌రెడ్డి సత్కరించారు.



విద్యార్థికి బహుమతిని అందిస్తున్న పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే, బిర్లా స్కూల్ ఫౌండర్ దాసరి మనోహర్‌రెడ్డి, పాఠశాల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి

## ‘బిర్లా’లో అలరించిన జంబోరి నైట్స్




పాటలు పాడుతున్న విద్యార్థులు

కరీంనగర్ బైపాస్‌లోని బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో శనివారం సాయంత్రం జరిగిన వార్షిక జంబోరి నైట్స్ వేడుకలు అలరించాయి. ఈ వేడుకలను పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దాసరి మమత ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ క్రీడల్లో రాణించిన క్రీడాకారులకు బిర్లా స్కూల్ ఫౌండర్, పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. ఈ వేడుకల్లో పాఠశాల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బబ్బిత విశ్వనాథం, పెద్దపల్లి డీసీపీ చైతన్య పాల్గొన్నారు.

– కరీంనగర్‌రూరల్, డిసెంబర్ 23

## మెడికల్ కౌన్సిల్ ఎన్నికల్లో డాక్టర్ రాజ్‌కుమార్ విజయం



ఎన్నికల అధికారి నుంచి ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న డాక్టర్ బండారి రాజ్‌కుమార్

విద్యానగర్, డిసెంబర్ 23 : కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో అనస్థీషియన్‌గా పని చేస్తున్న డాక్టర్ బండారి రాజ్‌కుమార్ మెడికల్ కౌన్సిల్ ఎన్నికల్లో విజయం సాధించాడు. ఈ నెల 22న ఎన్నికలు నిర్వహించగా, శనివారం లెక్కించారు. అయితే, రాష్ట్ర వ్యాప్తంగా వందలాది మంది వైద్యులు హేమాహేమీలు పోటీ చేసినా జిల్లా నుంచి రాజ్‌కుమార్ ఒక్కరే మెడికల్ కౌన్సిల్‌లో ఎన్నిక కావడం గమనార్హం. రాష్ట్ర వ్యాప్తంగా హెల్త్ రీఫార్మ్స్ డాక్టర్స్ అసోసియేషన్ (హెచ్ఆర్‌డీఏ) ప్యానల్ ఘన విజయం సాధించింది. ఎన్నికల్లో 17,090 ఓట్లు పోలు కాగా, ఇందులో 3311 ఓట్లను తిరస్కరించారు. రాష్ట్రం ఏర్పడ్డాక మొదటిసారి జరిగిన కౌన్సిల్ ఎన్నికల్లో ఒకే ప్యానల్‌కు మెజార్టీ రావడంతో ఇదే ప్యానల్ చైర్మన్ పదవిని ఎన్నుకోనున్నది. రాజ్‌కుమార్ ఎన్నికపై జిల్లాలోని పలువురు వైద్యులు అభినందనలు తెలిపారు.